# అమృత తిలకం

రాత్రి ఏడు గంటలప్పుడు వాకిటి తలుపు శబ్దమవ్వటంతో రామచంద్రమూర్తి లేచి కర్ర సాయంతో తలుపు దాకా అడుగులు వేసి చిన్నగా తలుపు తీశాడు.

బయిట చలికాలం చీకటి చుట్టూ వాతావరణాన్ని నల్లటి దుప్పటిలా కప్పివేసింది. వీధి దీపాల గుడ్డివెలుగు చీకట్లను చీల్చాలని ప్రయత్నిస్తున్నా అంతగా ఫలితం కనిపించటం లేదు. రాబోయేది అమావాస్యలే అన్నట్లుగా ఆకాశంలో నక్షత్రాలు విశ్రవీగుతున్నయి.

వయస్సు మీరిన ఆయన కళ్ళకు అంతా నల్లగానే కనబడుతున్నది. కాస్త చికిలించి చూచాడు- కళ్ళజోడు కోసం మళ్ళా మంచం దాకా కుంటుకుంటూ ఎక్కడ వెళతాలే అన్నట్లుగా.

"ఎవరు?"

వాకిటి పక్కకు తప్పుకున్న ఆ ఆకారం ఆయన ప్రశ్నకు సమాధానంగా ఓ అడుగు తలుపు వైపుకు వేసింది తడబాటుతో.

"నేను జయలక్ష్మిని!"

"జయలక్ష్మా!" ఆ కంఠం పరిచయమైన కంఠంలాగానే వుండటంతో ఆయన అనుమానంగా ఆ చీకట్లోకి చూచాడు. కళ్ళు మూసుకు తెరిచాడు వింతగా.

ఆమె ముందుకో అడుగు వేసి గడపవతలే ఆయనకు ఎదురుగ్గా నిలబడింది.

"మీ మొదటి భార్యను!" ఆమాట అంటున్నప్పుడు ఆమె కంఠం వణికింది.

ఆ వచ్చిందెవరో అర్థమయినప్పుడు ఆయనకు నోట మాట పెగల్లేదు.

"బాగున్నారా?" ఆమే తిరిగి అడిగింది.

అతడు ఏంచెప్పాలో తెలియని వాడిలా తలవంచుకు వెనక్కు తిరిగాడు.

"మా బాబాయి కొడుకు పెళ్ళికి వచ్చాను!" ఆమె చిన్నగా నసుగుతున్నట్లుగా అన్నది."లోపలకు రమ్మనమంటారా?"

అతడు ముఖం ఆమె వైపుకు తిప్పాడు. చేతి కఱ్ఱ మీద కాస్త వంగాడు. పెదాలు బిగించి ఆమెనే చూస్తున్నాడు. అతడి కళ్ళు తడవటం మొదలు పెట్టినయి.

ఆమెలో చాలా మార్పు కనబడుతోంది- కళ్ళజోడు పెట్టుకుంటే గాని తన అలసిన కళ్ళకు ఆ చీకట్లో ఆమె అసలు రూపం స్పష్టంగా కనబడదు.

అయన వడివడిగా కుంటుకుంటూ కఱ్ఱ సాయంతో మంచం దగ్గరకు వెళ్ళాడు. దిండు పక్కగా వున్న కళ్ళజోడు తీసుకొని పెట్టుకొని వెనక్కు తిరిగాడు.

అవును- ఆమె ఒకనాటి తన జయే!

ఆమె ఇంకా గడపవతలే వున్నది- ఆయన తన ప్రశ్నకు సమాధానం చెప్పక పోవటంతో.

"రా జయా! లోపలకు!" అన్నాడు.

ఆమె గుండె ఉద్విగ్నతతో కొట్టుకోవటం మొదలు పెట్టింది.

ముప్ఫయి సంవత్సరాల క్రితం తనను మెడ పట్టుకొని ఈ గడపవతలకు నెట్టింది ఆయనే... రెండు సంవత్సరాల వయస్సులో వున్న తన కూతురు జానకి తన చంకన వుండగా ఆ క్షణాన!

ఆమె లోపల కాలు పెట్టింది తడబడుతూ.

అదే ఇల్లు... అదే హాలు... ఆ మూలన అదే చెక్క బీరువా... ఆ గోడకు గుడ్డలు వేసే దండెం అదే... కానీ ఏమిటో అన్నీ పాతబడినట్లు, రంగు వెలసినట్లు, మట్టికొట్టు కున్నట్లు... అయ్యో ఆ మూలన అంత బూజున్నదేం?

- మొదటిసారిగా ఆయన చేతిలో తను చెంప దెబ్బలు తిన్నది ఇంటిలో బూజు సరిగ్గా దులపనందుకే!...

"ఆవిడ పోయిందట గదా?" అన్నది తల వంచుకొని.

ఆయన మాట్లాడలేదు. ఇక నిల్చోలేను అన్నట్లుగా పాతదుప్పటి పరిచి వున్న ఆ నవారు మంచం మీద కూర్చొని కఱ్ఱను పక్కన పెట్టాడు.

"అవును... సంవత్సరమయింది!"

తరువాత ఏం మాట్లాడాలో అర్థంగాక మౌనంగా నిలబడిపోయింది ఆమె.

- బాబాయి గారింట్లో పెళ్ళయిన మరునాడు ఆయన పెద్దకొడుకు- తన ఈడు వాడే- "ఏమే జయా! నీ మాజీ మొగుణ్ణి ఒకసారి చూచి వస్తావేమిటి... చాలా కష్టాలలో వున్నాడే పాపం... భార్య పోయింది... చేసేవాళ్ళు లేరు... వచ్చే పెన్షను తింటానికి సరిపోతున్నా... ప్రతి చిన్న పనికీ మరొకడి మీద ఆధార పడవలసిందే... డయాబిటక్ ఏమో... కాలికి లేచిన కురుపు తగ్గక పోవటంతో నానా యిబ్బందీ పడుతున్నాడు... ఎంత నిన్ను వదిలేసినా బంధుత్వం పోలేదు గదా! పెండ్లి శుభలేఖ ఇచ్చి వద్దామని వెళితే ఇదీ పరిస్థితి... కంట నీరు పెట్టుకున్నాడు... నువ్వెక్కడున్నావు ఎలా వున్నావు అని అడిగాడు గూడా!" అన్నాడు.

"చేసుకున్న వాళ్ళకు చేసుకున్నంత... ఆయన ఇప్పుడు కష్టపడుతున్నాడేమో... నేను ఆయన్ను చేసుకున్న ఖర్మానికి ముప్ఫయి ఏళ్ళ బట్టీ కష్టపడుతూనే వున్నాను!" అన్నది నిర్లిప్తంగా.

"ఆ కుర్చీ లాక్కొని కూర్చో!" అన్నాడు తలెత్తి ఆమె ముఖంలోకి చూస్తూ రామచంద్రమూర్తి.

జయలక్ష్మి కుర్చీ దగ్గరకు వెళ్ళి అందులో పడేసి వున్న మాసిన గుడ్డల్ని తీసి దండెం మీద వేసి కుర్చీ తెచ్చుకొని ఆయనకు కొద్ది దూరంలో కూర్చున్నది.

"ఎలా వున్నారు?"

"ఇలా!" అన్నాడు చాలా పేలవపు నవ్వుతో. "అటు బ్రతక లేక, ఇటు చావలేక త్రిశంకు స్వర్గంలో వున్నాను!"

తెరిచి వున్న తలుపులోనుంచి ఓ చిన్న పిల్ల వచ్చింది. చేతులో క్యారియరు పక్కన పెడుతూ, "రేపు నేను రావటం కుదరదండీ... మా అమ్మను ధర్మాసుపత్రికి తీసుకు వెళ్ళాలి. అక్కడ ఎంతాలస్యమవుతుందో ఏమో... రేపటికి ఎవరి చేతన్నా తెప్పించుకోండి... రాత్రికి మళ్ళా నేను తెచ్చిపెడతాను!" అన్నది.

ఆయన మాట్లాడలేదు. ఏం మాట్లాడాలో తెలియక గాదు. ఏం చేయాలో తెలియక... నెల రోజుల బట్టీ అసలు బయిటకి వెళ్ళలేక ఈ ఏర్పాటు చేసుకున్నాడు. తను హోటల్‌కి వెళ్ళాలంటే చాలా శ్రమతో గూడిన పని! ఇంట్లో వంట చేసుకోలేడు... చేసుకోవాలని వున్నా చేతగాదు... ఏనాడైనా వంట యింట్లో కాలు పెడితేనా?

"మీకో అబ్బాయి ఉండాలి గదా!"

"మా చదువుకున్న కోడలికి ఈ పాత ఇల్లు నచ్చలేదు... ఆమెకు ఇల్లు నచ్చలేదు అనే దానికంటే- ముసలి మామగారికి సేవ చేయటం ఇష్టం లేదు అనేది సరైన మాట... వాళ్ళు వేరే వుంటున్నారు!"

"ఎప్పుడైనా వచ్చి చూచి వెళుతుంటారా?"

"ఎందుకు రారు... వస్తుంటారు... వచ్చి కూర్చున్న ఆ కొద్ది సేపట్లో నా ఆరోగ్యం గురించి, నా ఇబ్బందుల గురించీ అడిగేదానికంటే- వాడు పడుతున్న ఇబ్బందులూ, డబ్బుకు కటకటలూ చెప్పుకోవటంతోటే కాలమంతా గడిచి పోతుంది!"

"అతడూ సుఖంగా లేడన్నమాట!"

పేలవంగా నవ్వాడు రామచంద్రమూర్తి. "సుఖంగా లేక కాదు... నేనెక్కడ డబ్బు సాయం చేయమని అడుగుతానోనని... ముందు కాళ్ళకు బంధాలు... నా నోరు తెరవకుండా కట్టి పడేస్తున్నాడన్నమాట!"

ఓ నిట్టూర్పు విడిచింది జయలక్ష్మి.

- ఈయనగారు తనని ఇంట్లోనుంచి బయటకు నెట్టి తలుపులేసుకుంటే పుట్టింటికి జేరింది. వాళ్ళూ అంత వున్న వాళ్ళేం కాదు. అయినా తన తండ్రి చాలా అభిమానధనుడు... అలాగే బ్రతికినంతకాలం ఎవరి చేతా ఒక్క మాట అనిపించుకోకుండా బ్రతికాడు!

బంధువులూ, తెలిసినవాళ్ళూ అంతా కోర్టుకెళ్ళమన్నారు... ఆయన ఒప్పుకోలేదు- "న్యాయస్థానాలు చెడిపోయిన సంసారాల్ని బాగుచేయలేవు... మహా అయితే భరణం ఇప్పించ వచ్చు... కానీ నా కూతురు ఒకరి భరణంతో బ్రతకవల్సినంత దీన స్థితిలో లేదు... నా గొంతులో ప్రాణముండగా అది మరొకరి దయా ధర్మ బిక్షం కోసం చేయి జాపదు!"- అన్నారు.

నిజమే! అలాగే చూచాడు తనని, తన కూతుర్ని ఆయన బ్రతికి వున్నంత కాలం. తన అన్నయ్య వదిన గూడా తనకు ఏనాడూ కించిత్ మనస్థాపం కలగకుండా ప్రవర్తించారు - తను వాళ్ళ పంచన అనాథగా పడి వున్నా. తన కూతురు పెద్దదయింది. పెళ్ళయింది. తల్లి లేని అల్లుడికి తనే తల్లయింది.

ఈ యింట్లోనుంచి కాలు బయట పెట్టిన తరువాత తిరిగి కాలు పెట్టటం ఇదే మొదటిసారయినా, ఆయన్నూ తను ఇంతవరకూ కంటితో చూడకపోయినా... ఇక్కడి

విషయాలు తనకు తెలుస్తూనే వున్నయి... ముఖ్యంగా బాబాయి కుటుంబం ద్వారా... తరువాత ఈయన రెండేళ్ళకు పెళ్ళి చేసుకోవటం, ఓ పిల్లవాడు పుట్టటం, ఆ రెండో భార్య రాచి రంపాన పెట్టటం, ఆమె చివరకు జబ్బు చేసి పోవటం...

జయలక్ష్మి గతాన్ని నెమరు వేసుకుంటూ ఆయన్నే చూస్తున్నది.

ఒకనాటి ఆయనలోని పొగరును, అహంభావాన్ని ఈనాటి చేతగానితనం మ్రింగివేసి దీనత్వపు దుప్పటిలో చుట్టివేసింది.

తన బాబాయి కొడుకు రామం అన్నట్లు- తిండికి ఇబ్బంది లేకపోవచ్చు... కానీ అప్యాయంగా పలకరించే మనషే లేదు!

"అయితే హోటల్ భోజనమేనన్న మాట!"

"స్వంత భోజనానికి అవకాశం లేనప్పుడు ఏదో ఒకటి తినాలి గదా మరి బ్రతికేటందుకు!" ఆయన పేలవంగా నవ్వాడు.

జయలక్ష్మి తల వంచుకున్నది.

– ఒక్కొక్కరిని కొన్నిరోజులు వెలిగిస్తయి. కొన్ని రోజులు చీకట్లు చుట్టి వేస్తయి... ఇది జీవిత భ్రమణంలో అతి సహజం!

"అమ్మాయికి పెళ్ళి చేశావన్నమాట...నేను నీకు చాలా అన్యాయం చేశాను జయలక్ష్మీ!" అన్నాడు వేదనతో.

"పెళ్ళేం ఖర్మ... తల్లిగూడా అయింది!" అన్నది నవ్వి.

"ఒక్క కార్డుముక్క వేసినా వచ్చి చూచి సంతోషించే వాడినేమో!"

జయలక్ష్మి మాట్లాడలేకపోయింది.

శుభలేఖలు ప్రింటయి వచ్చింతరువాత అన్నయ్యతో తను అన్నది గూడా!

ఆయన అంత సుముఖత చూపలేదు. "నువ్వు ఆ యింట్లోనుంచి వచ్చింతరువాత బ్రతికున్నావో, చచ్చావో తెలుసుకోవటానికైనా ఒక్కసారి ఇటు పక్కకు వచ్చాడా? ఏంవిటి ఆయనకు తెలియబరిచేది... వస్తాడో రాడో తరువాత సంగతి... వచ్చి ఇక్కడేమైనా పిచ్చి వేషాలు వేశాడంటే పెళ్ళి పందిట్లో మనకే నామర్దా!"

తను మరల ఆ విషయాన్ని ఎత్తలేకపోయింది వాళ్ళ ముందు.

"దాన్ని తీసుకు రాలేదా పెళ్ళికి?" ఒక్కసారి కూతుర్ని చూడాలనిపిస్తున్నది ఆయనకు.

"లేదు... అల్లుడిది బిజినెస్... ఎప్పుడూ బిజీనే... ఇంటికి ఎప్పుడు వస్తాడో, ఎప్పుడు వెళతాడో తెలియదు... అది లేకపోతే ఆయన తిండికి ఇబ్బందని తీసుకు రాలేదు!"

"రామం చెప్పాడు... హైద్రాబాద్ లోనటగదా వుంటున్నది!"

"దానికి పెళ్ళయినప్పటినుంచీ నేనూ అక్కడే వుంటున్నాను!"

"అల్లుడు బాగా చూస్తాడా దాన్ని?" ముఖమంతా కుంచించుకు పోతుండగా సిగ్గుపడుతూ అడిగాడు ఆ మాటను.

జయలక్ష్మి నవ్వింది. "వాళ్ళు బాగానే వుంటారు!"

మళ్ళా మౌనం.

"అది ఎలాగూ రాలేదు... వచ్చిన మనమరాలినన్నా తీసుకు వచ్చి వుంటే ఒక్కసారి చూచే వాడిని గదా!" అన్నాడు ఆయన.

"తీసుకు వద్దామనుకున్నాను... కానీ మిమ్మల్ని చూచి అది మీరు ఎవరు అంటే ఏంవని చెప్పాలి– మీ అమ్మమ్మను వదిలేసిన తాతయ్య అని చెప్పాలా?" ఆయన కళ్ళల్లోకే సూటిగా చూస్తూ అన్నది.

రామచంద్రమూర్తి ముఖం తెల్లగా పాలిపోయింది జయలక్ష్మి మాటకు.

"నేను తాతయ్యను కానా దానికి!" చాలా నీరసంగా అన్నాడు.

ఆమె తడబడ్డది. తనని తాను నిగ్రహించుకున్నది లోపలనుండి తన్నుకొస్తున్న వేదనని, ఆవేశాన్నీ. "ఏదో ఒకటి చెప్పేదాన్నే కాని... అది పెళ్ళికొచ్చిన తన ఈడు పిల్లలతో కూర్చొని ఆడుకుంటూ– నేను రాను అమ్మమ్మా అన్నది!"

"ఇంకో నాలుగు రోజులుంటావా?"

"లేదు... బాబాయి ఉండమంటున్నాడుగాని వెళ్ళాలి... రేపు వెళ్ళిపోతాం... అసలు ఇంత వరకూ మీ కూతురు దాని కూతుర్ని వదిలి ఇన్నాళ్ళు ఎప్పుడూ వుండలేదు!" అన్నది చిన్నగా నవ్వి.

తెరిచివున్న తలుపుగుండా వాకిట్లోకి చూస్తుంటే రామచంద్రమూర్తికి అంతా చీకటిగానే కనబడుతున్నది బయిట– తన భవిష్యత్తులాగా.

ఒక నిట్టూర్పు విడిచాడు.

అప్పటికి జయలక్ష్మి ఆ యింట్లోకి వచ్చి గంటయింది. 'ఇక వెళ్తాను' అన్నట్లుగా ఆయన వంక చూచింది.

ఆయన నీరసంగా, దిగులుగా ఆమె వంక చూచాడు.

"రేప్పొద్దున వచ్చి వంట చేసి పెట్టేదా?" అన్నది తలవంచుకొని చిన్నగా లోగొంతుకతో.

"దేనికి?"

"క్యారియర్ తెచ్చే అమ్మాయి రానందిగదా!"

"రేపు రాత్రికి వస్తుంది గదా!" అన్నాడు నిర్లిప్తంగా. "ఒక్క పూట భోజనం లేకపోతే ప్రాణం పోదు... కాదూ అలా జరిగిందే అనుకో- అంతకంటే ఈ ప్రాణికి ఆనందించ దగింది మరేంవున్నది!" ఆయన దుఃఖాన్ని ఆపుకోలేక పోయాడు. దిండు పక్కగా పడివున్న మాసిన తువ్వాల తీసి ముఖానికి అడ్డు పెట్టుకొని వలవలా ఏడ్వసాగాడు. రేపు ఉదయం భోజనం ఉండనందుకు గాదు- జయలక్ష్మి అంత ఆప్యాయంగా ఆ మాట అన్నందుకు. ఎంత ప్రయత్నించినా నిగ్రహించుకోలేక పోయాడు. నాభినుంచి పైకి చిమ్ముకొస్తున్న ఆ దుఃఖం అతడిలోని వేదనకు అద్దం పడుతోంది.

జయలక్ష్మి తడబడింది. లేచి, ఆయన పక్కన కూర్చొని, ఆయనను పొదివి పట్టుకొని, ఆయన దుఃఖానికి ఉపశమనం కలిగించాలి- అన్నంత ఆవేశమొచ్చినా నిభాయించుకున్నది.

ఆయన ఈరోజున తనకేమౌతాడు? ఆయన తనవాడే అయివున్నట్లయితే తన బ్రతుకు ఇలా ఉండేదా?

మనస్సు వికలమయింది- ఎవ్వరో అనుకుంటే తను ఆయన్ను చూడటానికి ఎందుకు వచ్చింది? ఆయన అనారోగ్యం గురించి, ఆయన పడుతున్న బాధల గురించి, ఆయన ఒంటరితనాన్ని గురించి తనెందుకు చింతిస్తున్నది?... ఆయనతో కలసి సంసారం చేసింది కొద్ది సంవత్సరాలే అవ్వవచ్చు కాని ఆ బంధం చాలదా తమ మనస్సుల స్పందనకు...

- ఆ వయస్సులో వున్న ఒక జీవి దుఃఖం మరో జీవికి బాధ కలిగిస్తుందనేది నిర్వివాదాంశం!

ఆయన తనని తాను అదుపులోకి తెచ్చుకొని, కళ్ళు తెరిచి, ఆమెనే చూస్తుండగా జయలక్ష్మి లేచింది.

"నేను వెళతాను!"

వెలుగునుంచి చీకటిలోకి వెళ్ళాలి అంటే భయపడాలి... చీకటిలోనుంచి చీకటిలోకి వెళ్ళటానికి వెరపు దేనికి?

"మంచిది జయా! అసలు నన్ను చూడాలని నువ్వు అనుకోవటమే నీలో నా మీద వున్న అభిమానానికి చిహ్నం ... ఇక ఇప్పుడు గతాన్ని సమీక్షించుకుంటూ బుర్రలు పాడుచేసుకోవటం దేనికి... మంచిది... వెళ్ళిరా... నువ్వు రావటమే నన్ను క్షమించటంగా భావించి తృప్తి పడతాను... వీలుంటే ఒక్కసారి మన మనుమరాలిని తీసుకు వచ్చి నాకు చూపిస్తే మరింత సంతోషిస్తాను!" అన్నాడు ఆయన మంచానికి ఆనించి వున్న చేతి కర్రను అందుకొని, దాని ఆధారంతో లేస్తూ. ఆయన జయలక్ష్మి ముఖంలోకే చూస్తున్నాడు... ఆమె విశాలమైన నుదుట వున్న ఎర్రని కుంకుమ బొట్టును చూస్తున్నాడు- అదే తన ప్రతి బింబం!

పెదాలు బిగించి ఆమెనే ఆత్మీయంగా చూస్తుండగా- ఆమె ఒక్కసారి... అదే చివరిసారేమో నన్నట్లుగా ఆయన ముఖంలోకి చూచి- చరచరా అడుగులు వేసుకుంటూ ఆ చీకటిలో కలిసి పోయింది!

* * *

సరిగ్గా మూడు రోజులకు...

అదే సమయం... అదే చీకటి...

తిరిగి ఆయింటి గడపలో కాలు పెట్టింది జయలక్ష్మి!

"ఊరికి వెళ్ళలేదా?"

"లేదు!"

"మా మనుమరాలు... దాని పేరేమన్నావ్... తీసుకు రాలేదేం మరి!"

"దాని పేరూ జయే... కావాలని మీ కూతురూ, అల్లుడూ కలసి నా పేరే పెట్టారు!"

జయలక్ష్మి ఆయనకెదురుగా కుర్చీలో కూర్చొని చుట్టూ పడివున్న మాసిపోయిన గుడ్డల్నీ, చిందరవందరగా పడి వున్న సామాన్లనీ, బూజు పట్టివున్న ఆ గది గోడల్నీ చూస్తున్నది నిర్లిప్తంగా.

మరోసారి రామచంద్రమూర్తి నిరాశగా అడిగాడు: "జయను తీసుకు రాలేదేం?"

"మొన్న వచ్చి వెళ్ళిన మరునాడు ఇక ప్రయాణం అవుదామని అనుకుంటుండగా అది రజస్వల అయి కూర్చున్నది... దాంతో హడావుడి, ఖంగారు... అమ్మాయికి ఫోను చేస్తే తను దగ్గరలేనే అని ఒకటే ఏడుపు... అల్లుడేమో ఊళ్ళో లేడట... ఇవ్వాళ వస్తాడట... మూడో రోజుకన్నా ఆయన్ను తీసుకువస్తాను... ఆ ఫంక్షనేదో వచ్చేసారి హైద్రాబాద్‌లో ఘనంగా చేసుకుందాంలే అన్నది... వాళ్ళు రేప్పొద్దున వస్తారు... ఎల్లుండి పొద్దున్నే దానికి నీళ్ళుపోసి తీసుకువెళతాం!... ఇక్కడే మా పిన్ని అన్నీ చేద్దామన్నది గాని అమ్మాయి లేకుండా నా వల్లేమవుతుంది... అయినా శాస్త్రార్థం చేయాల్సినవాటికి లోపం లేకుండా చేస్తున్నాం!" అంటూనే చీరచెంగుకు వున్న ముడి విప్పతీస్తూ, "మీకిష్టమని చిమ్మిరి తెచ్చాను!" అన్నది త్వరత్వరగా. ఆమాట అంటున్నప్పుడు ఆమె ముఖం కాస్త ఎర్ర బడింది సిగ్గుతో.

– ఆయనతో కాపురం చేసింది కొద్ది సంవత్సరాలే అయినా ఆయన ఇష్టాయిష్టాలు తనకు బాగా తెలుసు... ఆయనకు చిమ్మిరి అంటే ప్రాణం!

ఆయన పకపకా నవ్వాడు. "నీకు ఇంకా గుర్తున్నదన్న మాట!"

జయలక్ష్మి చాలా అప్యాయంగా నవ్వింది.

ఆయన చేయి జాపాడు కొండంత ఆశతో: "నేను సుగర్ పేషెంటునే అయినా నువ్వు తెచ్చావు కాబట్టి తినకుండా వుండలేను!" ఆయన చాలా హుషారుగా అన్నాడు.

"అయ్యో... నాకు ఆ ఆలోచనే రాలేదే!" అన్నది బాధతో నొచ్చుకుంటూ జయలక్ష్మి "మీకు యిష్టమనే ఉవ్విళ్ళూరాను గాని... మీరు తినగూడదనే విషయం నాకు గుర్తుకు రాలేదు!"

ఆమె చేతిలోనుండి చాలా చనువుగా అతడు కాగితంలోవున్న ఆ చిమ్మిరి ఉండను లాక్కొని నోట్లో వేసుకున్నాడు చటుక్కున.

జయలక్ష్మి ఖంగారు పడింది."పొరబాటు చేశాను... పొరబాటు చేశాను..." గొణుక్కోసాగింది.

"లేదు... నువ్వు సరైన పనే చేశావు!" అంటూ ఆయన కర్ర సాయంతో లేచి నిలబడ్డాడు. "ఏంవీ కాదు... ఇంకో మాత్ర ఎక్కువేసుకుంటాలే గాని దిగులు పడబోకు!" అన్నాడు ఆత్మీయంగా.

ఆయన అంత ధైర్యంగా అన్నా తను తప్పుచేసినట్లే బాధ పడింది జయలక్ష్మి

"కూతుర్ని, అల్లుడినైనా తీసుకు వచ్చి చూపిస్తావా?" ఆశగా అడిగాడు.

"వాళ్ళు ఇక్కడ ఇరవైనాలుగు గంటలు గూడా వుండరు... ఏమంటారో చూడాలి!"

ఆయన తల వంచుకొని వడివడిగా బీరువా దగ్గరకు వెళ్ళాడు. దాని పక్కనే వున్న చెక్క డ్రాయరు సొరుగు లాగాడు. అందులోనుంచి బీరువా తాళంచెవులు తీసుకొని, డ్రాయరు సొరుగు మూసి, బీరువా తలుపు తెరిచాడు. అందులోవి అన్నీ అటూ యిటూ ఒక ఐదు నిముషాలు దేనికోసమో వెతుకుతున్నట్లుగా కెలికి, చిన్న పెట్టెను బయిటకు లాగాడు.

దాన్ని తీసుకొని జయలక్ష్మి దగ్గరకు వచ్చి, "ఇక నా దగ్గర మిగిలిన వాటిలో ఇదే కాస్త విలువయినది... ఈ శుభ సందర్భంలో జయకు దీన్ని బహుమానంగా ఇవ్వు!" అంటూ ఆ పెట్టె మూత తెరిచాడు.

తలెత్తి 'ఏంవిటా అది' అన్నట్లుగా దానివంక చూచింది.

– అది తన పెళ్ళప్పుడు చేయించిన బంగారు నెక్లెస్. కళ్ళు పెద్దవి చేసుకొని దాన్నే చూస్తూ వుండిపోయింది కొన్ని క్షణాల వరకూ!

"తీసుకో జయా!" అన్నాడు ఆప్యాయంగా ఆమె ముఖంలోకే చూస్తూ.

జయలక్ష్మి కలవరపడుతూ లేచి నిలబడింది. "వద్దు... వద్దు... దానికేమీ వద్దు... ఇది తెలిస్తే రేపు మీ కుటుంబంలో లేనిపోని కలతలు రావచ్చు!"

ఆయన పెదిమలు బిగించి ఆమెనే చూస్తున్నాడు.

"కాదన వద్దు జయా... తీసుకో... ఇది నీది... నువ్వు తీసుకుంటే నాకు ఆనందం!"

ఆమె తడుస్తున్న కళ్ళతో ఆయన్నే చూస్తూ చేతులు అడ్డంగా ఊపుతోంది.

అతడు ఉద్రేకంతో ఊగిపోతున్నాడు.

"నువ్వు దీన్ని తీసుకోకపోతే నేను చచ్చినంత ఒట్టే!" అన్నాడు చివరి మాటలను ఒత్తి ఒత్తి పలుకుతూ.

జయలక్ష్మి తత్తరపడింది. "అలా అనవద్దు... అలా అనవద్దు!" అన్నది దుఃఖంతో గొంతు పూడుకు పోతుండగా.

ఎంతగానో కలవరపడుతున్నది ఆయన ఆ మాటలకు. ఆమె వణికి పోతున్నది.

"మరి తీసుకో!" బలవంతాన ఆమె చేతిలో ఆ నగను పెట్టి ఆమె గుప్పిట మూశాడు- ఆమె ముఖంలోకే చూస్తూ.

ఆలా చూస్తుండగానే అతడి కళ్ళు విశాలమయినయి. వాటిల్లో ఆపుకోలేని ఉద్విగ్నత చోటుచేసుకున్నది.

రెప్పలార్పటం గూడా మరిచిపోయాడు- కళగల ఆమె ముఖానికి వెలుగునిస్తున్న ఎర్రని కుంకుమ బొట్టును చూస్తూ....

కొద్ది క్షణాలలోనే అతడి మనస్సులో ఓ నిర్ణయం బలంగా నాటుకు పోయింది.

- తను వీలయినంత త్వరలో ఈ ఇల్లు అమ్మేసి, ఈ వస్తువులు అమ్మేసి, ఇక ఇక్కడ తనకంటూ ఏంవీ లేకుండా చేసి... ఎవరికీ, తనకు తెలిసిన ఎవరికీ కనబడని ప్రదేశానికి వెళ్ళిపోవాలి... ఎక్కడున్నదీ, ఏమైందీ గూడా తెలియనంత దూరానికి వెళ్ళి పోవాలి...

ఆ ఎర్రని కుంకుమ బొట్టు ఆమె నుదుటున అలాగే వెయ్యికొవ్వొత్తుల వెలుగునిస్తూ ఆమె జీవితాంతం మెరిసి పోతూ వుండాలి! ఇక ఇప్పుడు తను ఆమెకు చేయగలిగిన న్యాయం, చేకూర్చగలిగిన ఆనందం అదొక్కటే!

* * *

*(రచన: ఆగస్టు, 2004)*